క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: మండలంలోని తొర్రగుడిపాడు సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం ఆయా గ్రామాల పరిధిలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నందిగామ రూరల్ విద్యుత్ ఏఈ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాగల్లు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ, కొండూరు, దాములూరు, కొణతమాత్మకూరు, తొర్రగుడిపాడు, సోమవరం, రుద్రవరం, గోళ్ళమూడి, అమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



పెనుగంచిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహించారు. సబ్‌స్టేషన్ మరమ్మతులతోపాటు గ్రామంలో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించారు. కిందకు వేలాడుతున్న వైర్లను సరిచేశారు. ఈసందర్భంగా ఏఈ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా తగుచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

నందిగామ: మున్సిపల్ కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల నిరసన పిలుపు నేపథ్యంలో ఆయా డిమాండ్ల పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐటీయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ సమావేశం

జగ్గయ్యపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలస్థాయి సమావేశం ఆదివారం జరుగుతుందని మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్ శనివారం తెలిపారు. ఈ సమావేశం మండలంలోని ధర్మవరప్పాడుతండాలోని జెండాచెట్టు సెంటర్ వద్ద సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుందని వివరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను హాజరవుతారని చెప్పారు. మండలంలోని ఎస్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

పంటల నమోదుకు తుది గడువు రేపే

వీరులపాడు: ఈ-క్రాప్ పంటల నమోదుకు తుదిగడువు సోమవారంతో ముగియనుందని వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ శనివారం తెలిపారు. పంటల నమోదుకు సంబంధించిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలల్లో ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు. ఆయా జాబితాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. రైతులు సాగు చేసిన పంట వివరాలు, పంట రకం, సాగు విస్తీర్ణం, నీటి సదుపాయం తదితర వివరాల్లో మార్పులు, చేర్పుల కోసం సోమవారంలోగా రైతుభరోసా కేంద్రాల్లో అర్జీని అందజేయాలని రైతులకు సూచించారు.

శివాపురంలో కార్డన్ సెర్చ్



శివాపురం(పెనుగంచిప్రోలు): తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని శనివారం సరిహద్దు గ్రామమైన మండలంలోని శివాపురంలో ఎస్‌ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు తెలంగాణాలో జరగబోవు ఎన్నికల సందర్భంగా పలు జాగ్రత్తలు తెలియజేయడంతోపాటు ఎన్నికల నేరాలకు పాల్పడకుండా అవగాహన కల్పించారు. సెర్చ్‌లో భాగంగా తెలంగాణకు చెందిన 10 మద్యం సీసాలను కలిగిఉన్న ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

14 మద్యం సీసాలు స్వాధీనం

వీరులపాడు: మద్యం అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి మద్య తీసుకువస్తున్న చౌటపల్లి గ్రామానికి చెందిన పల్లెపోగు ఇజ్రాయిల్ వద్ద ఎనిమిది సీసాలు, అల్లూరు గ్రామానికి చెందిన గుణదల రాంబాబు వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. మద్యం అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయాలు సాగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఓటు అడిగే హక్కు వారికి లేదు



పెనుగంచిప్రోలులో పర్యటిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను, నాయకులు



తుర్లపాడులో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆయా పనులను అడ్డుకుంటున్న టీడీపీ వారికి ఓటు అడిగే హక్కు లేదని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పెనుగంచిప్రోలు సచివాలయం-3 పరిధిలోగల డౌన్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఆయా పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేయడమే కాకుండా నవరత్నాల పేరుతో అన్ని వర్గాల వారిని ఆదుకుంటున్నారన్నారు. చంద్రబాబు పాలన అంతా స్కాంల మయమని విమర్శించారు. స్కిల్ స్కాంలో రూ.371 కోట్లు అవినీతికి పాల్పడి జైలుకు వెళ్లారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా కూడా చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం అర్హులకు అందేవి కావని, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేసేవారని గుర్తుచేశారు. ఎవరు ఎన్ని విధాలుగా అడ్డుపడినా జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధిని ఆపలేరన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నట్లు చెప్పారు.

పైపులైన్ పనులకు శంకుస్థాపన..

గ్రామంలోని తూర్పు, పడమటబజారులోని ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు జలజీవన్ మిషన్ కింద మంజూరైన రూ.58 లక్షలతో నిర్మించనున్న పైపులైన్ పనులకు ఎమ్మెల్యే ఉదయభాను శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, కేడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కొమ్మినేని రవిశంకర్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, తహశీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి దోహదపడుతోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని కోనాయపాలెం, తుర్లపాడు గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైన్‌లు, కల్వర్టుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రణాళికలు సిద్ధంచేసి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెరమసాని నరసింహారావు, నాయకులు బుగ్గినేని సురేష్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, పారుపల్లి హరిబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మూతపడిన ఆలయాలు

నందిగామ : చంద్ర గ్రహణం నేపథ్యంలో డివిజన్ వ్యాప్తంగా ఆలయాలు మూత పడ్డాయి.పాక్షిక చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాల్లో నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శనివారం సాయంత్రం మూసివేశారు. పాక్షిక చంద్రగ్రహణం నేపథ్యంలో నందిగామలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, మండల పరిధిలోని కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, అంబారుపేటలోని సత్యమ్మ అమ్మవారి ఆలయం, పల్లగిరిగట్టుపై గల పలు దేవాలయాలతోపాటు మండలంలోని ఆలయాలు మూతపడ్డాయి. సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం నుంచి ఆలయాలు యథావిధిగా తెరుచుకోనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి అర్చకులు సాయంత్రం ఐదు గంటలకు ఆలయ తలుపులు మూశారు. ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, సిబ్బంది, అర్చకులు , హోంగార్డులు సమక్షంలో దేవాలయం కవాటబంధనం చేశారు. తిరిగి ఆదివారం ఉదయం 9 గంటలకు సంప్రోక్షణ అనంతరం అమ్మవారి దర్శనానికి ఆలయ తలుపులు తెరుస్తామని ఆలయ అధికారులు తెలిపారు.



పెనుగంచిప్రోలులో శ్రీతిరుపతమ్మ ఆలయాన్ని మూసివేసిన అధికారులు, అర్చకులు



మూతపడిన నందిగామలోని రామలింగేశ్వరాలయం

626 మందికి వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ స్రవంతి

వేదాద్రి(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. మండలంలోని వేదాద్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఆయన గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. వైద్యాధికారులు స్రవంతి, కీర్తిరెడ్డి, విద్యాసాగర్ పాల్గొని 626మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 20 శిబిరాలు నిర్వహించగా, ప్రజల నుంచి విశేషస్పందన లభించిందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడారు పేరయ్య, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాలుగు వేలమందికి అన్నదానం



జగ్గయ్యపేట అర్బన్: దసరా ఉత్సవాలలో భాగంగా స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఏర్పాట్లను ఆలయ ప్రైవేటు ఇంప్రూమ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ముగ్గురికి గాయాలు

నందిగామ: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఓ బస్సును కారు ఢీకొన్న ఘటన శనివారం నందిగామ మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం విజయవాడ వైపు నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐతవరం గ్రామం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఆగి ఉండగా, అదే సమయంలో అటుగా వస్తున్న కారు బస్సును వెనుక భాగంలో ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణం చేస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న 108సిబ్బంది క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు ముందుభాగం బాగా దెబ్బతింది. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై పండు దొర తెలిపారు.

బ్రిడ్జి మరమ్మతులకు రూ.18 లక్షలు మంజూరు



చందాపురం లోలెవల్ కాజ్‌వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: పట్టణ శివారు చందర్లపాడురోడ్డులోని చందాపురం సమీపంలోగల లోలెవల్ కాజ్‌వే బ్రిడ్జి మరమ్మతులకు రూ.18లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందాపురం బ్రిడ్జిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలాల నుంచి పంట ఉత్పత్తులను తరలించేందుకు కూడా రైతులు అవస్థలుపడుతున్నారన్నారు. బ్రిడ్జి పరిస్థితిని ఉన్నతాధికారులు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు త్వరితగతిన పనులు ప్రారంభించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి కాజ్‌వే మరమ్మతు పనులు చేపట్టేందుకు ట్రాఫిక్ మళ్లించాల్సి ఉంటుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పోలీస్ అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న వాల్మీకి బోయ సంఘ నాయకులు



నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేటఅర్బన్ : పట్టణ వాల్మీకి బోయసంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మిట్టగూడెంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ సభ్యులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని సూచించారు. సంఘ అధ్యక్షుడు భోగ్యం నాగులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ వైస్ ప్రెసిడెంట్ చిప్పగిరి సైదులు, అంబికా రోహిత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కంచికచర్లలో ..

కంచికచర్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భావితరాల కోసం రామాయణాన్ని అందించిన వాల్మీకి గొప్ప మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం. కనకారావు, కారల్‌మార్క్స్, బాజీ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

31న కౌన్సిల్ సాధారణ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 31న నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం తెలిపారు. ఈమేరకు 71అంశాలతో కూడిన అజెండాను రూపొందించినట్లు చెప్పారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్-అఫీషియో సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

కాలనీలకు మంచినీటి వసతి కల్పిస్తాం

పెనుగంచిప్రోలు: మండలకేంద్రం పెనుగంచిప్రోలు వాసులకు మంచినీటి వసతి కల్పించేందుకు నిధులు మంజూరైనట్లు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావుతో కలసి శనివారం ఆమె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుగంచిప్రోలులో జలజీవన్ మిషన్ నిధులు రూ.58లక్షలతో తూర్పు బజారు, పడమట బజారు ఎస్సీ కాలనీల్లో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి మంచినీటి వసతి కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కృషితో నిధులు మంజూరయ్యాయన్నారు. మునేరు అవతల ఒడ్డు నుంచి ఇవతలకు నూతన పైపులైన్ నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి మరో రూ.2.18 కోట్లు నిధులు మంజూరయ్యాయని వివరించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌కు బెడ్లు వితరణ



బెడ్లను అందజేస్తున్న రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో కిడ్నీ రోగుల కోసం ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌కు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యంవారు ఒక్కొక్కటి రూ.35వేల విలువైన రెండు బెడ్లు(ట్రీపోల్డ్)ను వితరణగా అందజేశారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, డయాలసిస్ సెంటర్ డాక్టర్ అజయ్‌రెడ్డి చేతులమీదుగా శనివారం రెండు బెడ్లను ఆస్పత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు హరిబాబు మాట్లాడుతూ మంచాలను అందజేసిన రామ్‌కో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మరో 15రోజుల్లో ఇంకో బెడ్‌ను అందజేస్తారని తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఉదయభాను కృషితో ప్రభుత్వాస్పత్రిని రూ.3 కోట్లతో అదనపు భవనాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం రూ 30 లక్షలతో ఆస్పత్రిలో అంతర్గత సీసీ రోడ్లు, ఇన్, అవుట్ గేట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవత్సవ్, జనరల్ మేనేజర్ (మెడికల్ అండ్ ఓహెచ్ఎస్)రాజా కేశవప్రసాద్, జీఎం ఫరూక్ మహ్మద్, డీజీఎం సీతారామరాజు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రూ.62 లక్షలు అందజేత



చెక్కును అందజేస్తున్న కొమ్మినేని రవిశంకర్

నందిగామ: స్వయంసహాయక సంఘాల మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ తెలిపారు.మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన నాలుగు స్వయంసహాయక సంఘాలకు రూ.62 లక్షల రుణం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన నగదు చెక్కులను కొమ్మినేని రవిశంకర్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా స్థిరపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వయంసహాయకసంఘాల ద్వారా మహిళలకు రుణాలు మంజూరు చేయడంతోపాటు సున్నా వడ్డీ పథకాన్ని కూడా అమలుచేస్తోందని తెలిపారు. రుణాలను మహిళలంతా సద్వినియోగం చేసుకుని ఆయారంగాల్లో ఆర్థిక అభివృద్ధిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మాగల్లు పీఏసీఎస్ కార్యదర్శి పూర్ణచంద్రరావు, గ్రామ పాలకేంద్రం అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నలుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: కష్టాల్లో ఉన్న పేదలను ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆదుకుంటోందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లోని గ్రామాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను సామినేని ఉదయభాను శనివారం తన నివాసంలో పంపిణీ చేశారు. పేట మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పెదవల్లి రాంబాబుకు రూ.1.20 లక్షలు, వత్సవాయి మండలంలోని తాళ్లూరుకు చెందిన సిద్దినేని హనుమంతరావుకు రూ.1.20 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన మాదినేని శ్రీనివాసరావుకు రూ.65వేలు, ముచ్చింతాల గ్రామానికి చెందిన మడుపల్లి చంద్రావతికి రూ. 26 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరయ్యాయి. ఈ మేరకు లబ్ధిదారులకు ఉదయభాను చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారుల కుటుంబసభ్యులు మాట్లాడుతూ సీఎం సహాయనిధి కింద ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పంటల నమోదు తప్పనిసరి



గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ గాంధీ, ఏవో రామసుబ్బారెడ్డి, సర్పంచ్ కూచి నర్సయ్య, రైతులు

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిస్తున్నారని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి స్థానిక సచివాలయ ఆవరణలో శనివారం సర్పంచ్ కూచి నర్సయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల వివరాలను సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంటల నమోదుతో రైతులకు ఎంతో మేలన్నారు. తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు. ఈ-క్రాప్ నమోదుకు తుదిగడువు ఈనెల 30వతేదీతో ముగుస్తుందని వివరించారు. ఇప్పటివరకు పంటల నమోదు చేయించుకోనివారు వెంటనే చేయించుకోవాలని సూచించారు. ఏవో కె. రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రూ.2.80కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం



కంచికచర్ల జుజ్జూరురోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ కొలతలు తీస్తున్న సచివాలయ ఇంజినీర్



కీసర ఎస్సీకాలనీలో పూర్తయిన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు

కంచికచర్ల : మండలంలోని ఆయా గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2.80కోట్లు మంజూరు చేయగా, పనులు దాదాపు పూర్తయ్యాయి. తమ గ్రామానికి రోడ్లు, డ్రైనేజీ వసతి కల్పించాలంటూ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల విజ్ఞప్తి మేరకు నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ స్పందించి ఆయా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. కంచికచర్ల మండలంలో సిమెంట్‌రోడ్లు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు కాగా, పనులు పూర్తిచేసినట్లు ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. రూ.80లక్షలతో ఆయా గ్రామాల్లో డ్రైనేజీ పనులు చేపట్టారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం కింద ప్రతి సచివాలయ పరిధిలోని సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించడంతో ఆ నిధులతో అధికారులు ఆయా ప్రాంతాల్లో మౌలికవసతులు కల్పిస్తున్నారు. ఇలా సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.2.80కోట్లు కేటాయించి పనులను పూర్తిచేయడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.